## పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో పొగలు.. ప్రయాణికుల్లో కలకలం

**బిట్రగుంట, జులై 11, ప్రభాతవార్త :** చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడకు వెళ్తున్న పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో శనివారం ఒక్కసారిగా పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రైలులోని డి6 కోచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది.సమాచారం ప్రకారం, నెల్లూరు రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన పినాకిని ఎక్స్‌ప్రెస్ కావలి రైల్వే స్టేషన్ దాటిన కొద్దిసేపటికే డి6 బోగీలో పొగలు కనిపించాయి. దీంతో అప్రమత్తమైన ప్రయాణికులు వెంటనే రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అధికారులు వెంటనే స్పందించి రైలును సుమారు 15 నిమిషాల పాటు నిలిపివేశారు. అనంతరం పొగలు రావడానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు తీసుకున్న తర్వాత రైలును తిరిగి గమ్యస్థానానికి పంపించారు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదని ప్రాథమిక సమాచారం. అయితే పొగలు రావడానికి గల ఖచ్చితమైన కారణాలపై రైల్వే రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జులై 11, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 0క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి మట్టం 78 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయం లో 33.982 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి250, ఎస్ఎఫ్‌సికి 50, పెన్నా డెల్టా 900 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 92.667 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# రాజీ మార్గమే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్
- త్వరిత న్యాయం అందించడంలో లోక్ అదాలత్ కీలకం
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల




**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త – కలెక్టరేట్** వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా కావడంతో పాటు త్వరితగతిన న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ.నందన్, అదనపు ఎస్పీ సౌజన్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయస్థానాలపై కేసుల భారం అధికంగా ఉండటంతో అనేక కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనివల్ల కక్షిదారులు సమయం, ధనం కోల్పోవాల్సి వస్తోందని, ఈ పరిస్థితిని అధిగమించేందుకే రాజీ మార్గమే రాజమార్గం అనే భావనతో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే ఇద్దరికీ ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థకు ఇళ్ల పన్ను, వ్యాపార పన్ను, నీటి పన్ను తదితరాల రూపంలో సుమారు రూ.100 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్న ఆయన, ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించినప్పుడే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు అభివృద్ధి పనులు, ప్రజా సేవలను సమర్థవంతంగా అందించగలవని చెప్పారు. నేషనల్ లోక్ అదాలత్‌కు ముందు పంపిన నోటీసులకు స్పందించి శుక్రవారం సాయంత్రానికే సుమారు రూ. 1 కోటి పన్నుల బకాయిలు వసూలయ్యాయని వెల్లడించారు. మిగిలిన బకాయిదారులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానం ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని, భారతదేశంలో కూడా ప్రజలు దీనిని ఎక్కువగా వినియోగించుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నప్పటికీ, కుటుంబ, ఆస్తి, సివిల్ వివాదాల పరిష్కారం న్యాయవ్యవస్థ ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. అలాంటి వివాదాలకు లోక్ అదాలత్ అత్యంతసమర్థవంత మైన వేదికగా నిలుస్తోందన్నారు.

❖ రెండు పక్షాలు అంగీకారంతో ముందుకు వస్తే న్యాయస్థానం చట్టబద్ధత కల్పించి శాశ్వత పరిష్కారం అందిస్తుందని, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, చిన్న వివాదాలు కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైతే పోలీసు శాఖ, న్యాయస్థానాలపై ఉన్న పెండింగ్ కేసుల భారం తగ్గి కీలకమైన కేసులపై అధికారులు మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ మాట్లాడుతూ నగరంలో రహదారులు, తాగునీరు, పారిశుద్ధం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయవనరని తెలిపారు. పన్నులు చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, బకాయిదారులందరూ జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పన్నుల బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మోటారు ప్రమాద పరిహార కేసులు, బ్యాంకుల వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కేసులు, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్ పన్నుల బకాయిలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులను లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, బ్యాంకులు, వివిధ ప్రభుత్వ శాఖలు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదులు, లోక్ అదాలత్, బార్ అసోసియేషన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

# తీరం మాదే ఇక్కడ వేట మాదే

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల
- సీజ్ చేసిన 7 బోట్లు వదిలే ప్రసక్తే లేదు
- రాష్ట్ర మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు ఆధారాలతో వివరించాం
- సమస్య తీవ్రత, మన ఆవేదనను తమిళనాడు ప్రతినిధులు అర్థం చేసుకున్నారు
- తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు
- ఆంధ్రప్రదేశ్ జలాల్లో అక్రమ చేపల వేటను ఏమాత్రం సహించబోం
- ప్రత్యేక బృందాలతో నిరంతరం గస్తీ కొనసాగుతోంది
- మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం
- కలెక్టరేట్లో ఆంధ్రప్రదేశ్-తమిళనాడు అంతర్‌రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం






**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త – కలెక్టరేట్** ఆంధ్రప్రదేశ్ తీరానికి 23 కిలోమీటర్ల పరిధిలోకి ఇతర రాష్ట్రాలకు చెందిన చేపల వేట బోట్లు ప్రవేశించడం చట్టవిరుద్ధమని, రాష్ట్ర మత్స్యకారుల జీవనోపాధి, సముద్ర జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ – తమిళనాడు అంతర్‌రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, జిల్లా అటవీశాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా, మెరైన్ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు డా. పి. సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి. లక్ష్మణరావు, ప్రకాశం జిల్లా సంయుక్త సంచాలకులు శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్ బాషాతో పాటు మెరైన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.తమిళనాడు రాష్ట్రం నుంచి మత్స్యశాఖ, మత్స్యకారుల సంక్షేమ శాఖ డైరెక్టర్ డా. విజయ కార్తికేయన్, చెన్నై జిల్లా కలెక్టర్ మాలతి హెలెన్, రాయపురం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పరమనాథం, స్టేట్ ఇంటెలిజెన్స్ వింగ్ డీఎస్పీ కరియప్పన్, అదనపు మత్స్యశాఖ డైరెక్టర్ నూర్‌జహాన్ బీవి, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎలంగో సమావేశానికి హాజరయ్యారు.తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మత్స్యకారుల సమస్యలు, సముద్ర జలాల్లో అక్రమ ప్రవేశాల వల్ల కలుగుతున్న నష్టం తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్, ఎస్పీ తమిళనాడు అధికారులకు వివరించారు.సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మీడియాతో మాట్లాడుతూ, గత మూడు నెలలుగా మన జిల్లా సరిహద్దు తీర ప్రాంతంలోని సముద్ర జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్న తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన మత్స్యకారుల వల్ల మన రాష్ట్ర మత్స్యకారులకు కలుగుతున్న నష్టాన్ని తమిళనాడు అధికారులకు సమావేశంలో సవివరంగా వివరించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే నెల నుంచి ప్రత్యేక సముద్ర గస్తీ ప్రారంభించిన అనంతరం అక్రమ ప్రవేశాలపై కఠిన నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు.

❖ మత్స్యకారుల సమస్యలను నాలుగు విభాగాలుగా వర్గీకరించి తమిళనాడు ప్రతినిధులకు వివరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బోట్లు, తమిళనాడుకు చెందిన బోట్లు, తమిళనాడు బోట్లలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, చిన్న అవుట్‌బోర్డ్, ఇన్‌బోర్డ్ ఇంజిన్ బోట్ల ద్వారా అక్రమంగా ప్రవేశించే వారి సమస్యలను విడివిడిగా వివరించామని, ముఖ్యంగా నాలుగో కేటగిరీ వల్లే అధిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం అత్యధిక సమస్య పుదుచ్చేరి నుంచి వస్తోందని, అక్కడి నుంచి 640 హార్స్‌పవర్ సామర్థ్యం గల భారీ ట్రాలర్లు గుంపులుగా వచ్చి ఆంధ్రప్రదేశ్ జలాల్లో చేపల వేట నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ బోట్లు రాష్ట్ర మత్స్యకారుల వలలను ధ్వంసం చేయడంతో పాటు సముద్ర జీవవైవిధ్యానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అక్రమ చేపల వేటకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు, జీపీఎస్ టైమ్‌స్టాంప్‌లు, బోట్ల వివరాలు వంటి సాంకేతిక ఆధారాలను సమావేశంలో తమిళనాడు ప్రతినిధులకు ప్రదర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే భారీ ట్రాలర్లు, నిషేధిత వలల వినియోగం వల్ల రక్షిత జాతికి చెందిన ఆలివ్ రిడ్లే తాబేళ్లు మృతి చెందుతున్న విషయాన్ని కూడా వివరించినట్లు చెప్పారు.ఈ ఆధారాలను పరిశీలించిన తమిళనాడు ప్రతినిధులు సమస్య తీవ్రతను, మన బాధను అర్థం చేసుకొని, తమ రాష్ట్రానికి చేరుకున్న వెంటనే చెన్నైలో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మత్స్యకారులకు అవగాహన కల్పించి, ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు.మన తీరం పరిధిలోని సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించిన తమిళనాడు, పుదుచ్చేరికి చెందిన సీజ్ చేసిన ఏడు బోట్లను విడుదల చేయాలని తమిళనాడు ప్రతినిధులు విజ్ఞప్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఏ బోటును విడుదల చేసే ప్రసక్తే లేదని, తమిళనాడు అధికారులు తీసుకునే చర్యలను పరిశీలించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మాత్రమే బోట్ల విడుదలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి చేపల వేట బోటులో ట్రాన్స్‌పాండర్‌ను తప్పనిసరిగా అమర్చాలని, అది ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండాలని సమావేశంలో సూచించినట్లు తెలిపారు. 23 కిలోమీటర్ల పరిధిలోకి ప్రవేశించే సమయంలో ట్రాన్స్‌పాండర్ ద్వారా హెచ్చరిక సందేశాలు అందే విధంగా వ్యవస్థ పనిచేస్తోందని వివరించారు.జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో సముద్ర గస్తీ నిరంతరం కొనసాగుతోందని, భవిష్యత్తులో కూడా అక్రమంగా ఆంధ్రప్రదేశ్ జలాల్లోకి ప్రవేశించే ఏ బోటునైనా స్వాధీనం చేసుకుని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు తరలిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత రాష్ట్రాలు తమ మత్స్యకారులు నిబంధనలు పాటించేలా ఆచరణాత్మక చర్యలు తీసుకునే వరకు సీజ్ చేసిన బోట్లను విడుదల చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

❖ సమావేశానికి పుదుచ్చేరి అధికారులు హాజరు కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన అధికారులు, సమావేశ నిర్ణయాలను తమిళనాడు ప్రభుత్వంతో పాటు పుదుచ్చేరి ప్రభుత్వానికి కూడా అన్ని ఆధారాలతో పంపించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

❖ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, మత్స్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల




**నెల్లూరు, జులై 11, ప్రభాతవార్త – కలెక్టరేట్** నెల్లూరు జిల్లాలోని రైతు సోదరులకు సాగు ఇబ్బందులు లేకుండా, ప్రస్తుత ఖరీఫ్ (2026–27) సీజన్‌కు సంబంధించి అన్ని రకాల పంటలకు అవసరమైన యూరియా పంపిణీకి జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలో యూరియా ఎరువుల కొరత ఏమాత్రం లేదని, రైతులు ఎలాంటి ఆందోళన లేదా ఊహాగానాలకు లోనుకాకుండా తమ వ్యవసాయ పనులను నిశ్చింతగా కొనసాగించవచ్చని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.


**యూరియా నిల్వలు, విక్రయాల అధికారిక వివరాలు :** జిల్లాలో సాగు అవసరాలకు అనుగుణంగా ఇప్పటి వరకు 34,675.394 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి జిల్లాలో 15,778.814 ఎంటి నిల్వలు ఉన్నాయి. గడిచిన నెల రోజుల్లో 18,896.58 ఎంటి యూరియా జిల్లాకు చేరింది. జిల్లా వ్యాప్తంగా జూన్ 8వ తేదీ నుండి ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా ఇప్పటివరకు 56,275 మంది రైతులకు 17,321.67 ఎంటి యూరియా విజయవంతంగా విక్రయించడమైనది. ఈ నిల్వలను జిల్లా వ్యాప్తంగా అన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్ గూడౌన్లు మరియు గుర్తింపు పొందిన ప్రైవేట్ రిటైల్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచబడ్డాయి.

**ధర పరిశీలన :** ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు బస్తాపై ముద్రించిన గరిష్ట చిల్లర ధరను తప్పకుండా పరిశీలించాలన్నారు. నిర్ణీత ధర కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించరాదు. రశీదు పొందాలి.. కొనుగోలు చేసిన ప్రతిసారీ అధికారిక డీలర్ నుండి తప్పనిసరిగా పాయింట్ ఆఫ్ సేల్ మెషిన్ ద్వారా వచ్చే రశీదును అడిగి పొందాలి.

**బ్లాక్ మార్కెట్, అక్రమ విక్రయాలపై కఠిన హెచ్చరిక..** జిల్లాలో ఎవరైనా డీలర్లు లేదా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించినా, లేదా యూరియా నిల్వలను అక్రమంగా వేరే ప్రాంతాలకు మళ్లించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తీవ్రంగా హెచ్చరించారు. అటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై ఎరువుల నియంత్రణ చట్టం – 1985 చట్టం ప్రకారం కఠిన చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవడమే కాకుండా, వారి వ్యాపార లైసెన్సులను తక్షణమే రద్దు చేస్తామని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# కాల్వల్లో విషతుల్యంగా పారిశ్రామిక వ్యర్థాలు

- ఆందోళనలో గ్రామస్థులు



**కొడవలూరు, జులై 11 ప్రభాతవార్త:** అభివృద్ధి పేరుతో వెలసిన ఫ్యాక్టరీలు ఇప్పుడు స్థానిక ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయి. కోవూరు, కొడవలూరు మండలాల పరిధిలోని ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న విషతుల్యమైన రసాయన వ్యర్థాలు మలిదేవి కాల్వను కలుషితం చేస్తున్నాయి. ఈ మురికి నీరు విడవలూరు మీదుగా ముదివర్తి, ఊటుకూరు గ్రామాల గుండా ప్రవహించి చివరకు పెన్నా నదిలో కలుస్తోంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన నిబంధనలను ఫ్యాక్టరీ యాజమాన్యాలు బేఖాతరు చేస్తుంటే, స్థానికులు మండిపడుతున్నారు.

**అస్తవ్యస్తంగా జీవనోపాధి :** ఈ కలుషిత నీటిపై ఆధారపడిన వందలాది కుటుంబాలు నేడు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.

**రజకుల అవస్థలు :** ఈ కాల్వ నీటినే నమ్ముకుని వృత్తిని కొనసాగిస్తున్న రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీటితో బట్టలు ఉతకడం వల్ల వాటిని ధరించేవారికి చర్మవ్యాధులు,ఇతరఅంటువ్యాధులు సోకేప్రమాదం పొంచి ఉంది.

**పశువుల ఆరోగ్యం:** గ్రామీణ ప్రాంతంలో ప్రధాన జీవనాధారమైన పాడి పశువులకు ఇదే నీరు దిక్కవుతోంది. ఈ విషపూరిత నీటిని తాగి పశువులు అనారోగ్యానికి గురవుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చేపల వేటపై ప్రభావం:** గిరిజనులు ఈ కాల్వల్లో చేపల వేట ద్వారా జీవనం సాగిస్తుంటారు. రసాయనాలతో నిండిన నీటిలోని చేపలను తింటే ప్రాణాంతక వ్యాధులు వస్తాయని తెలిసి కూడా, వేరే దారి లేక ప్రమాదకరమైన చేపలను పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

**మౌనం వహిస్తున్న అధికారులు :** కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీలు వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే బయటకు వదలాలి. కానీ, ఇక్కడ నిబంధనలకు తిలోదకాలిచ్చి యథేచ్ఛగా మురికి నీటిని కాల్వల్లోకి వదులుతున్నా, కనీసం ప్రశ్నించే నాథుడే లేడు.

**తక్షణమే స్పందించాలి :** "ఏళ్లుగా ఫ్యాక్టరీల కాలుష్యం వల్ల మా ఊర్లు నాశనమవుతున్నాయి. అధికారులు ఫ్యాక్టరీలను తనిఖీ చేసి, కాలుష్యాన్ని అరికట్టాలి. లేదంటే రాబోయే రోజుల్లో గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు తీవ్రమై అంటువ్యాధుల బారిన పడటం ఖాయం" అని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కలుషిత జలాల విడుదలపై చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని స్థానికులు కోరుతున్నారు.

## పన్ను వసూళ్ళకు దిశానిర్దేశం చేసిన జిల్లా న్యాయమూర్తికి కృతజ్ఞతలు కమిషనర్ వైఓ.నందన్




**నెల్లూరు కార్పోరేషన్, జులై 11 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థకు బకాయిదారులు చెల్లించాల్సిన వివిధ రకాల పన్నుల వసూళ్ళకు దిశా నిర్దేశం చేసి, పన్నుల వసూళ్ళ ప్రక్రియను పూర్తిస్తాయిలో సహకారం అందించిన జిల్లా జడ్జి శ్రీనివాస్ సేవలు అత్యంత ప్రశంసనీయమని కమిషనర్ వైఓ.నందన్ సభా ముఖంగా కృతజ్ఞతలను తెలిపారు. జిల్లా జడ్జి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల, కమిషనర్ వైఓ.నందన్‌ల సమక్షంలో శనివారం జిల్లా కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరవ్యాప్తంగా వివిద రకాల అభివృద్ది పనులు జరుగుతున్నాయని, నగరపాలక సంస్థ ద్వారా ఆయ అభివృద్ధి పనులను నిర్వహించేందుకు పన్నుల ద్వారా సేకరించిన మూలధానాన్ని వినియోగించగలమని స్పష్టం చేశారు. బకాయిదారుల అందరూ బాధ్యతగా బావించి నగరపాలక సంస్థకు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని, నగర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో తమ వంతు భాగస్వామ్యాన్ని పౌరులుగా చాటుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోక్అదాలత్ వై.పద్మశ్రీ, నెల్లూరు నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఓటు కీలకమే - ఆర్డీవో అరుణ కుమారి



**గూడూరు, జులై 11, ప్రభాతవార్త** గూడూరు అర్బన్ ప్రాంతంలో సర్ మందకోడిగా సాగుతుందని బిఎల్వోలు బిఎల్ఎలు సమన్వయంతో వేగవంతం చేయాలని ఈ నెల 14వ తేదీ లోపు పూర్తి చేయాలని ఓటర్లందరూ అధికారులకు సహకరించాలని గూడూరు ఆర్డీవో అరుణకుమారి కోరారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సర్ పై బూత్ లెవెల్ అధికారులు, పార్టీ బిఎల్ఏలతో ఆర్డీవో అరుణకుమారి సమావేశం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ లోపు పూర్తి స్థాయిలో ఓటరు వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీవో అరుణకుమారి మాట్లాడుతూ ఓటర్ వెరిఫికేషన్ కొనసాగుతుందని శనివారం ఆదివారం సెలవు దినం అయినా బిఎల్‌వోలు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంటారని ఓటర్లు వచ్చి ఫోటో ఆధార్ కార్డు అందించి వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. దీనిపై ఏమైనా అనుమానాలు ఉంటే శివాలయాల్లో ఉండే బిఎల్ఓలతో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు, బిఎల్ఓ, బిఎల్ఎ పాల్గొన్నారు.


## సర్ ప్రక్రియపై బిఎల్ఓలతో సమీక్ష చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, జులై 11 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ స్థానిక బిసికెసి కళ్యాణ మండపం నాగుల పట్ట వీధి, బాలాజీ నగర్ కాంతమ్మ ఆశ్రమ్మ, ఇసుకడింక సచివాలయాల పరిధిలో ప్రాంతాలలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సూపర్‌వైజర్‌లు, బిఎల్ఓలతో శనివారం సమీక్షించారు. సచివాలయాల పరిధిఓని పోలింగ్‌స్టేషన్‌లో ఎస్ఐఆర్ నమోదు శాతం పరిశీలించి సంబంధిత బిఎల్ఓలతో మాట్లాడి ఓటర్ల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న స్తానిక సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. నిర్దేశించిన సమయంలోపు తప్పనిసరిగా 100శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సమగ్ర ఓటరు జాబితాలో స్థానం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐఆర్ ప్రక్రియపై క్షేత్రస్తాయిలో చేపట్టాల్సిన వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కార్తీక్, క్రిష్ణంరాజు, శ్రావణ్‌కుమార్, సందీప్, వరప్రసాద్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## చౌటపల్లిలో శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి

ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన



**వింజమూరు, జులై 11, ప్రభాతవార్త** వింజమూరు మండలం, గుండెమడకల పంచాయతీ పరిధిలోని చౌటపల్లి గ్రామంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో, వేద మంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరై, వేద పండితుల ఆశీర్వచనాల మధ్య శాస్త్రోక్తంగా శంకుస్థాపన నిర్వహించి దేవాలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ నిధుల ద్వారా రూ.40 లక్షల వ్యయంతో శ్రీ కోదండ రామాలయ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. శ్రీ కోదండ రాములవారి అనుగ్రహం గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీరామచంద్రుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హిందూ సమాజాన్ని, యావత్ ప్రజానీకాన్ని విమర్శిస్తూ మత విద్వేషాలు సృష్టిస్తున్న జడ శ్రవణ్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలి




**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త – అగ్రికల్చర్ :** మాజీ ముఖ్యమంత్రి జగన్ కోసం పనిచేస్తున్నానంటూ, నోరు పారేసుకుంటున్న జడ శ్రావణ్ కుమార్ పై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్యానలిస్ట్ కర్నాటి ఆంజనేయ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయాలలో హుందాగా నడుచుకోవాలని, నోరు తగ్గించుకొని సభ్యత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారు. నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. తాను దళిత క్రిస్టియన్ అంటూ, క్రిస్టియన్ సభల్లో హిందూ సమాజాన్ని యావత్ ప్రజానీకాన్ని విమర్శిస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్న జడ శ్రావణ్ కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల దొంగ సర్టిఫికెట్లతో న్యాయవాదులుగా కొంతమంది ప్రాక్టీస్ చేస్తున్నారని అలాంటి వారిలో జడ శ్రావణ్ కుమార్ కూడా ఉన్నారేమో అని అనుమానం ఉందన్నారు ఆయన సర్టిఫికెట్లపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆయన మెజిస్ట్రేట్ అవునో కాదో తేల్చాలన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న శాసనసభ డిప్యూటీ స్పీకర్‌ని పంది అంటూ, ఆయన్ని కోసి వేయాలి అంటూ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణకు చెందిన అమర ప్రసాద్ తాను ఎస్సీ నాయకుడనని, హిందూ మాల అని తాను స్వయంగా ప్రకటించుకుంటే ఆయన్ని కూడా కాళ్లు విరగగొడతానని, ముక్కలు ముక్కలుగా కోస్తాను అంటూ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేసిన జడ శ్రావణ్ కుమార్‌ను చట్టం ముందు నిలబెట్టి శిక్ష వేయాలన్నారు. ఈ దేశంలో అన్ని కులాలు అన్ని మతాలు సమానమేనని రాజ్యాంగం కూడా అదే సూచిస్తుందన్నారు. హిందువులలో కుల వివక్ష ఉందనే అసమానతలు ఉన్నాయని తమను దేవాలయాలలోకి ప్రవేశించనీయడం లేదని, మాకు సముచిత గౌరవం ఇవ్వడం లేదంటున్న కొంతమంది దళితులు క్రిస్టియన్లుగా మారుతున్నారని, అలాంటివారు మతం మారి రిజర్వేషన్లు కల్పించాలంటూ అడగడం సరైన చర్య కాదన్నారు. దళితులకు క్రిస్టియన్‌గా మతం మారితే రిజర్వేషన్ అవసరం లేదని అలా మారిన ఎస్సీ, ఎస్టీలకు సుప్రీంకోర్టు రిజర్వేషన్ అవసరం లేదని తేల్చి చెప్పిందన్నారు. అలాంటప్పుడు దళిత క్రిస్టియన్ అంటూ రిజర్వేషన్లు కల్పించాలి అనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మత మార్పిడి నిరోధక చట్టాన్ని తీసుకురావాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తొలుత ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డిఎస్ పరశురామ్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం అన్ని మతాలు సమానమేనన్నారు. మతం మారిన క్రిస్టియన్లు ఇతర మతాల మధ్య చిచ్చుపెట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలనే ఉద్దేశంతోనే కొంతమంది ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ప్రవీణారెడ్డి నేతలు వై. ఫణి రాజు, గురవయ్య, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు లాల్ ఖాజా మస్తాన్, కరణం సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదలతో దేశాభివృద్ధికి విఘాతం






**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త – వైద్యం :** ప్రజల్లో కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా జనాభా నియంత్రణకు అవకాశం కలుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి వి. సుజాత అన్నారు. శనివారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం నుండి ప్రారంభమైన ర్యాలీ గుప్తా పార్కు వరకు సాగింది. ఈ ర్యాలీలో జనాభా పెరుగుదల కారణంగా జరిగే అనర్థాలపై ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ జనాభాను అరికట్టేందుకు కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కుటుంబ నియంత్రణ సేవలను అర్హులైన దంపతులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన కుటుంబ జీవనాన్ని సాగించాలని సూచించారు. మాతా శిశు సంక్షేమం, జననాల మధ్య సరైన విరామం, మహిళల ఆరోగ్యం, బాలికల విద్య, లింగ సమానత్వం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆమె తెలిపారు. ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగిపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, పరిమితమైన వనరులపై జనాభా ఒత్తిడి పెరిగి, నిరుద్యోగం, పేదరికం, కాలుష్యం వంటి సమస్యలు చుట్టుముడతాయన్నారు. ఈ పరిస్థితుల్లో జనాభా నియంత్రణ అనేది ఒక అత్యవసర అంశంగా మారిందని వివరించారు. డిఎల్ఏటిఓ డాక్టర్ ఎస్‌కే. ఖాదర్ వలీ మాట్లాడుతూ పసి వయసులో గర్భధారణ సరైన విధానం కాదని అదే విధంగా పిల్లల మధ్య విరామం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ హేనా సుజన్ వారి సిబ్బంది వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

**– కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన వారికి ప్రోత్సాహకాలు** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ అనంతరం నెల్లూరులోని డీయంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వీ. సుజాత అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన వారికి నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ జిల్లా వైద్యశాల ఆత్మకూరుకు చెందిన సిహెచ్ కిరణ్ కు ఉత్తమ గైనకాలజిస్ట్‌గా ప్రశంసా పత్రం అందించి నగదు బహుమతిని అందజేశారు. అనంతరం తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులకు నలుగురికి, ఒక్కొక్కరికి ప్రశంసా పత్రంతో పాటు ఐదు వేల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్న ఇద్దరికీ ఐదు వేల నగదు బహుమతి, ముగ్గురు లేదా అంతకన్నా ఎక్కువమంది పిల్లలు కలిగిన ముగ్గురు దంపతులకు ఒక్కొక్కరికి ప్రశంసా పత్రంతో పాటు 5 వేల వంతున నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి హేనా సుజన్, డీఎల్ఏటిఓ డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వలీ, డాక్టర్ రమేష్, డాక్టర్ అంసుధర్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ కే సహన, ఐబీ మార్గరెట్, ఆర్ రమేష్, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదునుకు.. రాలని చినుకు



**కోట, జూలై 11 ప్రభాతవార్త :** ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా నేలపై ఇప్పటికీ ఒక్క చినుకూ రాలలేదు. వర్షాధారంగా సాగు చేసే మెట్ట భూములను దుక్కి చేసి నీటి తడుల కోసం ఆకాశం వైపు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. జూన్ చివర్లో ఖరీఫ్ పంటల సాగు 50–80 శాతం పూర్తి కావాల్సి ఉంది. జూలై రెండోవారంలోకి అడుగుపెట్టినా పది శాతం పంటలు కూడా సాగులోకి రాకపోవడంతో ఖరీఫ్‌లో గడ్డు కాలం నడుస్తోం దని కర్షకులు కలత చెందుతున్నారు. ఖరీఫ్‌లో ప్రధానంగా వేరుశనగ, ఇతర చిరుధాన్యాల పంటలు మెట్ట భూముల్లో వర్షాధారంగా సాగు చేస్తారు. ఖరీఫ్‌లో రైతులకు ప్రధానంగా బోర్ల కింద కొందరు వరి నాట్లను పోసినా వాటిని తడుపుకోవడానికి కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి ఈ నెలాఖరు వరకు కొనసాగితే జిల్లాలో సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు మొదలయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని రైతులను సమాయత్తం చేస్తున్నప్పటికీ వర్షాభావ పరిస్థితిని చూసి ఆ పంటల సాగుకు మొగ్గు చూపడం లేదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. చినుకు కోసం ప్రతిరోజు ఆకాశం వైపు చూడటం రైతుల వంతైంది.

## రాజీయే రాజమార్గం



**కోవూరు, జూలై 11 ప్రభాతవార్త :** పెండింగ్ కేసుల పరిష్కారానికి కోర్టు చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి. చైతన్య అన్నారు. కోవూరులోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు పూర్తిస్థాయిలో చట్టభద్రత కూడా ఉంటుందన్నారు. రెండు పక్షాలు పరస్పర అంగీకారంతో రాజీకి వస్తే ఇద్దరికి ప్రయోజనం చేకూరడంతో పాటు శాశ్వత పరిష్కారం కూడా లభిస్తుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని కక్షిదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నమ్రత, లోక్ అదాలత్ సభ్యులు రాంబాబు, చంద్రమోహన్, తదితరులు ఉన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం



**ఉదయగిరి, జూలై 11, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎంఆర్వో ఎల్.రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ డ్రైవ్‌లో లక్ష్యాలు సాధించని బీఎల్‌వోలను ఒకచోటకు చేర్చి సర్ ఫారం నమోదు, సందేహాలను నివృత్తి డిజిటలైజేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు.

## వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, జూలై 11 ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ బీసీ బాల బాలికల వసతి గృహ సముదాయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ తెలిపారు. కోవూరులోని బీసీ బాల బాలికల వసతి గృహ సముదాయంలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావడంతో సంబంధిత సంక్షేమాధికారులు విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా వసతి గృహ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. ఎవరైనా విద్యార్థికి నలతగా ఉంటే వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించేలా సంబంధిత సంక్షేమాధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాతావరణ మార్పు వలన కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు సుభాషిణి, సుమలత, పద్మజ, సుప్రజ, సీహెచ్‌వో ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీవోలు సంతోషి, నాగమణి, ఏఎన్ఎంలు ఉమాదేవి, స్రవంతి, సుభాషిణి, ఆరోగ్య సహాయకులు సుధాకర్, జనార్ధన్, రాజశేఖర్, సురేష్, ఆశాలు, తదితరులు ఉన్నారు.

## గడువులోగా ఎస్‌ఐఆర్ పూర్తి కావాలి



**పడుగుపాడు( కోవూరు,) జూలై 11 ప్రభాతవార్త :** ఎస్‌ఐఆర్ కార్యక్రమానికి కేవలం మూడు రోజులు మాత్రమే గడువు ఉందని ఈ లోగా సంబంధిత బీఎల్‌వోలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో నూరుశాతం పూర్తయ్యేలా తగు చొరవ తీసుకోవాలని సీడీపీవో టి. శారద అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు మూడవ సచివాలయంలో శనివారం బీఎల్‌వోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో ఇప్పటికే 75 శాతం పైగా పూర్తి చేశారని, మిగిలినది కూడా సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగర్యాలీ



**కోవూరు, జూలై 11 ప్రభాతవార్త :** కోవూరులోని వసతి గృహ సముదాయ ప్రాంగణంలో శనివారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారుఈ కార్యక్రమంలోఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ .సీహెచ్‌వో ప్రభావతి, ఎంఎల్ హెచ్‌పీవోలు సంతోషి, నాగమణి, ఏఎన్ఎంలు ఉమాదేవి, స్రవంతి, సుభాషిణి, ఆరోగ్య సహాయకులు సుధాకర్, జనార్ధన్, రాజశేఖర్, సురేష్, ఆశాలు, తదితరులు ఉన్నారు.

## రొయ్యల పరిశ్రమ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి - సీఐటీయూ



**తోటపల్లి గూడూరు, జూలై 11, ప్రభాతవార్త:** మండలంలోని అనంతవరం వాటర్ బేస్, మహాలక్ష్మిపురం శరత్ రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్ల వద్ద సీఐటీయూ మండల కార్యదర్శులు మారుబోయిన రాజా, చింత రామసుబ్బయ్య కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. జూలై 30న నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే కనీస వేతనాల పోరాట ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. రొయ్యల పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి చట్టబద్ధ హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని వారు ఆరోపించారు. రోజువారీ వేతనాల స్థానంలో పీస్‌రేట్ విధానాన్ని అమలు చేస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని, మహిళా కార్మికులు అధికంగా పనిచేస్తున్నప్పటికీ వారికి తగిన రక్షణ, భద్రత కల్పించడం లేదని అన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా రొయ్యల పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలని, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 30న జరిగే జిల్లా కలెక్టరేట్ మహా ధర్నాలో రొయ్యల పరిశ్రమల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ప్రతి ఓటును కాపాడుకోవాలి



**ఆత్మకూరు, జులై11, ప్రభాతవార్త:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎ)లు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆపార్టీ ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వరరెడ్డి సూచించారు. అర్హులైన ప్రతి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చివరి వరకు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఫారాన్ని పరిశీలించి లోపాలను వెంటనే గుర్తించాలన్నారు. శనివారం ఆత్మకూరులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ వార్ రూమ్‌లో ఉదయగిరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, పార్లమెంటరీ ఎస్ఐఆర్ టాస్క్‌ఫోర్స్ సభ్యులు కూనం సుధాకర్‌రెడ్డి తో కలిసి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించి బిఎల్ఎలకు పలు కీలక సూచనలు చేశారు. ఆత్మకూరు నియోజకరవర్గంలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ జిల్లాస్థాయిలో వేగంగా సాగుతోందని పేర్కొంటూ మిగిలిన నాలుగురోజుల్లో పెండింగ్‌లో ఉన్న ప్రతి దరఖాస్తును పూర్తిచేయాలన్నారు. బిఎల్ఓలు విధుల నిర్వహణలో ఎక్కడైనా నిర్లక్ష్యం , జాప్యం లేదా ఇబ్బందులు ఎదురైతే వేంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. మృతిచెందిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వారి వివరాలు గుర్తించలేని ఓటర్ల జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులైన ఓటర్ల వివరాలు ఎట్టి పరిస్థితుల్లోను మిస్‌కాకుండా చూడాలన్నారు. దీనిపై నాయకులు బిఎల్ఎలకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఎస్ఐఆర్‌ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా అభ్యంతరాలు తెలిపే అవకాశం ఉంటుందని , అర్హులైన ఓటర్లపేర్లు తొలగించినట్లు గుర్తిస్తే వెంటనే ఆధారాలతో ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. ఓట్ల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి చట్టబద్ధంగా పరిష్కారం పొందేలా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.ఆదిశేషయ్య, రాష్ట్ర మున్సిపల్ విభాగ కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆత్మకూరు టౌన్ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, సంగం మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగ కన్వీనర్ బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసులురెడ్డి, బత్తిన నారాయణరెడ్డి, పాలేటి వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూలై 11 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతా చార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని సాంప్ర దాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ పోలుదాసు వెంకటేశ్వర్లు, భక్తులు ఉన్నారు.

## చికెన్ వ్యర్థాల వాహనాన్ని స్వాధీనం చేసుకున్న మర్రిపాడు పోలీసులు



**మర్రిపాడు, జులై11, ప్రభాతవార్త:** మైదుకూరు నుండి చికెన్ వ్యర్థాలను అనుమతి లేకుండా తరలిస్తూ ఆవటిని చేపలకు, పందులకు ఆహారంగా వేస్తూప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తూ ప్రయాణీకులకు, వాహనదా రులకు ఇబ్బంది కలిగిస్తు న్నారన్న సమాచారం మర్రిపాడు ఎస్ఐ బలరామిరెడ్డి ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు తన సిబ్బందితో శనివారం బ్రాహ్మణపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీ చేస్తుండగా బద్వేల్ నుండి మర్రిపాడు వైపు వస్తున్న ఎపి39 టియు2356 నెంబర్ గల బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న 10డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసున్నారు. వాహన యజమాని అందుబాటులో లేనందున వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి చికెన్ వ్యర్థాలను రెవెన్యూవారి సమక్షంలో ఊరిబయట పూడ్చి వేశారు.

## రైలులోనుంచి జారిపడి వ్యక్తి మృతి



**బిట్రగుంట జూలై 11 ప్రభాతవార్త** కావలి జి ఆర్ పి పోలీస్ స్టేషన్ పరిధిలో బిట్రగుంట రైల్వే స్టేషన్ నందు కి.మీ నంబరు 207 / 4446 పోస్టుల మధ్య దిగులైన్లో వెలుచున్న రైలు బండి నుండి సుమారు 4045 సంవత్సరముల వయస్సు కలిగిన గుర్తు తెలియని మగ వ్యక్తి రైలు నుండి జారిపడినందున కలిగిన గాయములకు పై వ్యక్తి మరణించడం జరిగిందని జి ఆర్ పి పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి బులుగు రంగు నిండు చేతుల చొక్కా, బులుగు రంగు ప్యాంటు మరియు ఆకుపచ్చ తెలుపు రంగుల చెక్స్ డిజైన్ కలిగిన టవల్ ధరించి ఉన్నారన్నారు . మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినవారు కావలి రైల్వే పోలీసులను సంప్రదించగలరని కోరారు.

## ఈ రోడ్డు మరమ్మత్తులు ఎప్పటికి పూర్తి అవుతాయో



**బిట్రగుంట జులై 11ప్రభాతవార్త** : మండలకేంద్రమైన బోగోలు నుండి ఇబ్రహీంపేట కు వెళ్లే రహదారి కి సంబంధించిన ఆర్ అండ్ బి రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. పలు మార్లు గతుకులు పూడ్చి తారు వేసిన నిలవడం లేదు. ఇటీవల దీనిపైన తారు వేసేందుకు గ్రావెల్ తోలి వదిలేసారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు త్వరిత గతిన ఈ రహదారికి మరమ్మత్తులు చేయాలనీ విజ్ఞప్తి చేస్తు న్నారు.

## నంది వాహనంపై రామలింగేశ్వరుడి విహారం

**విడవలూరు, జూలై 11 ప్రభాతవార్త:** మండలంలోని రామతీర్థం గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షి దేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ సేవలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లు నంది వాహనంపై గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగారు. స్వామివారిని దర్శించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అడుగడుగునా మహిళలు కాయ కర్పూరాలతో హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకుంటూ స్వామివారిని దర్శించుకున్నారు. మంగళ వాయిద్యాలు, శివనామస్మరణల మధ్య సాగిన నంది వాహన సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈరోజు ఉత్సవాలకు కనుపర్తి ఆదినారాయణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన స్పెసిఫిక్ ఎండోమెంట్ తరఫున దండిగుంట గ్రామానికి చెందిన రామకృష్ణయ్య ఉభయకర్తగా వ్యవహరించారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో మెంబర్ పేరెపి శ్రీకాంత్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 185వ బూత్లో మరణించిన 62 మంది ఓటర్ల పేర్లు తొలగించాలని వినతి



**కొడవలూరు, జూలై 11 ప్రభాతవార్త:** మండలంలోని నార్తురాజుపాలెం గ్రామం 185వ పోలింగ్ బూత్ ఓటరు జాబితాలో మరణించిన 62 మంది ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్చార్జి తువ్వర ప్రవీణ్కుమార్ శనివారం బీఎల్వో కిరణ్కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొందరు శాశ్వతంగా ఇతర గ్రామాలకు నివాసం మార్చుకోగా, మరికొందరు వివాహానంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని తెలిపారు. ఉద్యోగరీత్యా వేరే ప్రాంతాల్లో స్థిరపడి, అక్కడే ఆధార్ చిరునామా మార్చుకుని ఆయా ప్రాంతాల ఓటరు జాబితాల్లో నమోదైన వారి వివరాలను కూడా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితా నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి తప్పులు లేకుండా ఉండేలా మరణించిన ఓటర్ల పేర్లను తొలగించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని బీఎల్వోకు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ డిజిటైజేషన్‌కు జోరు

**– కొడవలూరులో 81.25 శాతానికి చేరిన నమోదు – తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి**



**కొడవలూరు, జూలై 11 ప్రభాతవార్త :** మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియలో డిజిటైజేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తహశీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి తెలిపారు. మండలంలోని 41, 244 మంది ఓటర్లకు సంబంధించి 33,512 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటైజ్ చేయడంతో 81.25శాతం పురోగతి నమోదైందని వెల్లడిం చారు. శనివారం ఒక్క రోజే 341ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటైజ్ చేశారు. మొత్తం 55 మంది బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ప్రక్రియను వేగవంతం చేస్తు న్నారని తెలిపారుసూ పర్‌వైజర్ల వారీగా ఏవీడీ రామప్రసాద్ పరిధిలో 107, ఆర్. అశ్విన్ పరిధిలో 101,పీ.రామ్ హరీష్ పరిధిలో 60,కె.మస్తాన్‌బాబు పరిధిలో 43,ఎం.రామగా యత్రి పరి ధిలో 30ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ ను పూర్తిచేసేందుకు అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు కొనసాగి స్తున్నట్లు తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ పై అవగాహన కల్పించేందుకు హెల్ప్ డెస్క్



**వింజమూరు, జూలై 11, ప్రభాతవార్త :** ఓటరు జాబితాలో పారదర్శకత పెంచేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్వే చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో ఓటర్ల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తాసిల్దార్ స్వర్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో 146 నుండి 165 వరకు గల పోలింగ్ స్టేషన్ కు చెందిన బిఎల్‌ఓలు వీఆర్వోలు ఉదయం ఉండే అందుబాటులో ఉండి ఓటర్లకు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ స్వర్ణ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ సర్వే ముఖ్య ఉద్దేశం ఓటరు జాబితాను సంపూర్ణంగా లోపాలు లేకుండా తయారు చేయడమేనని తెలిపారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటుతో ఎనిమిరేషన్ ఫారాలు అందరివారు పారాలు అందిన 2002 ఓటరు జాబితాలో సీరియల్ నెంబర్ కనుగొనలేని వారు పేర్లు మార్పు చిరునామా మార్పులు కొత్తగా 18 ఏళ్ల నిండిన వారు వీరందరూ హెల్ప్ డెస్క్ ను సంప్రదించి తమ వివరాలను అందించాలని సూచించారు. ఎస్సైఆర్ సర్వేలో పాల్గొనడం ప్రతి ఓటర్ బాధ్యత అన్నారు గడువులోగా పారాలు సమర్పించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, సొసైటీ అధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, కోడూరు నాగిరెడ్డి, చల్లా శ్రీనివాసులు యాదవ్, దుద్దిగుంట శ్రీనివాసరెడ్డి, ఇతర నాయకులు, బిఎల్వోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం



**వింజమూరు, జూలై 11, ప్రభాతవార్త :** గుండె మం డల సబ్ స్టేషన్ పరిధిలో నేడు ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయము ఏర్పడనుందని ట్రాన్స్కో ఏఈ ఎస్కే నాగూర్ వల్లి తెలిపారు. మోట చిం తలపాలెం ఫీడర్‌లోని 33 కెవి మెయింటినెన్స్ పనులు చేపడుతున్న కార ణంగా గుండిబడగల సబ్స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ కారణంగా గుండుమలకుల సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా పొందుతున్న అన్ని గ్రామాలలో కాలనీలకు విద్యుత్తు ఉండదన్నారు కనుక అన్ని గ్రామాల, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. మెయింటెనెన్స్ పనులు త్వరగా పూర్తిచేసి నినేత సమయానికి విద్యుత్తు పునరుద్దిస్తామని ఆయన తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

**నెల్లూరు, జూలై 11, ప్రభాతవార్త – వైద్యం** 33/11 కెవి ఆటోనగర్ సబ్ స్టేషన్‌లోని 11 కెవి ఆటోనగర్ ఫీడర్ నందు చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆటోనగర్, అయ్యప్ప గుడి పరిసర ప్రాంతాలలో ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడునని విద్యుత్ ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవలసిందిగా ఆయన కోరారు. అత్యవసర సేవలకు సంబంధించిన వారు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవలసిందిగా తెలియజేసారు.

